క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎస్‌ఆర్‌నగర్ మెయిన్‌రోడ్డు ఏరియా, కమ్యూనిటీ హాల్ లేన్, ఆంధ్రాబ్యాంక్ లేన్, ఎస్‌బీహెచ్ బ్యాంక్ లేన్, చైతన్య జూనియర్ కాలేజ్, 2ఆర్‌టీ, 3ఆర్‌టీ క్వార్టర్స్, శాంతిబాగ్, శివబాగ్, కేకే హోటల్, డీకేరోడ్డు, మాజీ గవర్నర్ రోశయ్య నివాసం లేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

నేడు హెల్దీ బేబీ షో

లాలాపేట: అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తార్నాక డివిజన్ పరిధిలోని శాంతినగర్ ఫేజ్ గార్డెన్‌లో హెల్దీ బేబీ షో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహిళా మోర్చా నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి జీ20 బృందం

రాంగోపాల్‌పేట్: జీ20 బృందం శుక్రవారం సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని సందర్శించింది. హర్ష్‌వర్ధన్ నేతృత్వంలో చీఫ్ కోఆర్డినేటర్ రమేష్‌బాబు, జేఏస్ సమ్మిట్స్ అశోక్‌కుమార్ శర్మతో పాటు పలువురు అధికారులు ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్యను కలిశారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా వ్యర్థాలతో తయారు చేసిన జీ–20 కళాఖండాన్ని ప్రారంభించారు.

భోలక్‌పూర్‌లో కార్పొరేటర్ పర్యటన

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ కె.హేమలత శుక్రవారం భోలక్‌పూర్‌లో పర్యటించారు. జలమండలి డీజీఎం వెంకట్రావ్‌తో కలిసి తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఏసూరి మహేష్, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్, మహాలక్ష్మి, శ్రీరామ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మార్చి నుంచి అందుబాటులోకి స్విమ్మింగ్‌పూల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ స్విమ్మింగ్‌పూల్‌ను మార్చి నుంచి అందుబాటులోకి తీసుకొస్తామని డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కరోనా కారణంగా మూసివేసిన స్విమ్మింగ్‌పూల్‌కు ఈ నెల 23 నుంచి క్లీనింగ్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులతో పాటు బయటి వ్యక్తులను సైతం స్విమ్మింగ్‌పూల్‌కు అనుమతించనున్నారు.

న్యూసెన్స్‌కు పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష

చిలకలగూడ: బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్న ఇద్దరు యువకులకు న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. చిలకలగూడ సీఐ నరేష్ తెలిపిన వివరాల మేరకు.. చిలకలగూడకు చెందిన శరత్‌చంద్ర(20) ఈ నెల 18న ఓ వ్యక్తి ఇంట్లోకి వెళ్లి అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు బయటకు వచ్చి బహిరంగ ప్రదేశంలో న్యూసెన్స్ చేసి ప్రజాజీవనానికి ఆటంకం కలిగించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని శరత్‌చంద్రను అదుపులోకి తీసుకున్నారు. ఈపెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం సికింద్రాబాద్ 15వ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చగా 120 రోజుల జైలు శిక్ష, రూ.1170 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో 30 రోజులు జైలుశిక్ష ఉంటుంది. మరో ఘటనలో చిలకలగూడకు చెందిన నీరటి మహేందర్(29) ఈ నెల 19న బహిరంగ ప్రదేశంలో న్యూసెన్స్ చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. ఈ పెట్టీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా 30 రోజుల జైలు శిక్ష, రూ.1050 జరిమానా విధించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు శరత్‌చంద్ర, మహేందర్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ నరేష్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న ఇళ్లకు ఆర్థిక సాయం

రాంగోపాల్‌పేట్: అగ్ని ప్రమాదం జరిగిన రాధా ఆర్కేడ్ పక్కనే ఉన్న కాచిబోలి బస్తీలో 15 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినడంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేటర్ చీర సుచిత్ర ఆధ్వర్యంలో ఒక్కో ఇంటికి రూ.10వేల నగదు పంపిణీ చేశారు. సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన బస్తీని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి అక్కడి ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బస్తీ వాసులకు పట్టాలు అందించినట్లు ఆయన తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రాణం పదిలం

బన్సీలాల్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు మద్యం తాగకుండా వాహనాలు నడిపినప్పుడే వాహనచోదకుల ప్రాణాలు పదిలంగా ఉంటాయని నగర ట్రాఫిక్ పోలీస్ శిక్షణ కేంద్రం అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ జి.శంకర్‌రాజు 'సాక్షి' ముఖాముఖిలో పేర్కొన్నారు. అందుకోసం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు, భద్రతపై విద్యార్థులు, యువతతో పాటు ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపుతున్నట్లు ఆయన తెలిపారు. విద్యాసంస్థలు, జన బాహుళ్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలను జాగృతం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?

ఏసీపీ: రోడ్డు ప్రమాదాల పట్ల వాహనదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డుపై వాహనాన్ని ఎలా డ్రైవ్ చేయాలి, ట్రాఫిక్ నిబంధనలు ఎలా ఉన్నాయి, వాటిని పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండడం ఎలా అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వాహనాల పెరుగుదల, జనసామర్థ్యం, రోడ్ల పరిస్థితి గురించి ప్రజలకు వివరిస్తున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ పోలీస్ శిక్షణ కేంద్రంలో వాహనచోదకులకు ఎలాంటి అవగాహన కలిగిస్తున్నారు, ఎక్కువగా అక్కడికి వచ్చే కేసుల గురించి చెప్పండి.


ఏసీపీ శంకర్‌రాజు

ఏసీపీ: నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల కుటుంబం పడే ఆవేదనను సదరు వ్యక్తులకు తెలియజేస్తున్నాం. ఎంతో గొప్ప జీవితం గడపాల్సిన వారు ఎందుకు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు అనే విషయాన్ని వివరిస్తున్నాం. మా వద్దకు డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. మైనర్ల డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపి పోలీసులకు పట్టుబడిన కేసులు మా వద్దకు వస్తున్నాయి.

ప్రశ్న: మీ శిక్షణ ద్వారా వాహనచోదకుల్లో ఎలాంటి మార్పులు చూస్తున్నారు?

ఏసీపీ: ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత మా వద్దకు సదరు వ్యక్తులను పంపిస్తారు. వారికి శిక్షణలో అనేక విషయాల గురించి తెలియజేస్తున్నాం. వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శిక్షణ ఇస్తున్నాం. దీంతో అనేక మందిలో మార్పు స్పష్టంగా కనిపించింది. మళ్లీ తప్పు చేసి ఇక్కడికి రావద్దనే భావన వారిలో చూస్తున్నాం. చిన్న పొరపాటు కారణంగా కుటుంబం ఎలాంటి ఇబ్బంది పడుతుందోననే విషయాలను శిక్షణలో తెలుసుకుంటున్నారు.

ప్రశ్న: 2022లో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ఇతర కేసుల్లో ఎంత మంది మీ వద్దకు వచ్చారు.. వారికి మీరిచ్చిన సూచనలు ఏంటి?

ఏసీపీ: నగర వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి కేసు నమోదు అయిన వారికి మా కేంద్రం ద్వారా శిక్షణ ఇస్తాం. రోడ్డుపై తప్పులు చేయకుండా, సక్రమంగా వాహనాలు నడిపే విధంగా సూచనలు చేస్తున్నాం. 2022 సంవత్సరంలో 25,292 మందికి అవగాహన కల్పించాం. ఇందులో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 18,817 మంది కాగా, మైనర్లు 4,199 మంది, ఇతర కేసుల్లో 2,276 మందికి పలు అంశాలపై అవగాహన కల్పించాం.

ప్రశ్న: డ్రైవింగ్ విషయంలో యువత, విద్యార్థులకు మీరిచ్చే సూచనలు?

ఏసీపీ: అతివేగం, హెల్మెట్ లేకుండా, మత్తుతో రోడ్లపై డ్రైవింగ్ చేస్తూ ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా 18 నుంచి 35 సంవత్సరాల వయస్సులో ఉన్న వారు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత ఇలా మరణించడం దురదృష్టకరం. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న తర్వాతే వాహనం నడపాలి. డ్రైవింగ్‌ను ఆస్వాదించాలి, ఆనందించాలి.. జీవితాన్ని సుఖమయం చేసుకోవాలి అనే విషయాన్ని యువత గుర్తు పెట్టుకోవాలి. ఆవేశంతో నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయరాదనే విషయాన్ని గ్రహించాలి. వేగం కాదు, భద్రత ముఖ్యమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ఆదాయం కోసమే ఆరాటం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రామ్‌గోపాల్‌పేట: అగ్నిప్రమాదం సంభవించిన రాధా ఆర్కేడ్ భవనాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదాయం కోసమే ప్రభుత్వం పని చేస్తున్నట్లు ఉందని విమర్శించారు. నగరంలో జనావాసాల మధ్య గోదాములు, వేర్ హౌస్‌లు ప్రమాదకరంగా ఉన్నాయని, వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జీహెచ్‌ఎంసీకి డబ్బు అవసరం వచ్చినప్పుడల్లా అక్రమ నిర్మాణాలను రెగ్యులరైజ్ చేస్తూ వస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు జరిగిన బోయిగూడ, రూబీ లాడ్జి వంటి ప్రమాదాలన్నీ నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ నిర్మాణాల కారణంగానే జరిగాయన్నారు. జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న భవనాలపై సర్వే నిర్వహించి వాటిని బయటి ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అక్రమ నిర్మాణాలు జరగవన్నారు. సమీప బస్తీలో పర్యటించిన కిషన్‌రెడ్డి బీజేపీ డాక్టర్స్ సెల్ ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ బస్తీ వాసులకు టిఫిన్, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

పరిశీలించిన కలెక్టర్ అమయ్‌కుమార్

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆర్డీవో వసంతకుమారి, సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజలతో కలిసి ఆయన భవనాన్ని, కాచిబోలి బస్తీని, వెనుక వైపు ఉన్న అపార్ట్‌మెంట్లను పరిశీలించారు. డ్రోన్‌ల ద్వారా గల్లంతైన వారి కోసం గాలిస్తున్నామని, పూర్తిగా సమాచారం రాలేదని ఆయన అన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి

అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ కేఎల్‌ఎన్‌వై పార్కు అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులు శుకవారం ఆయనను కలిసి పార్కులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వీధి కుక్కల బెడద, వెలగని లైట్ల గురించి వారు మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తలసాని త్వరలో పార్కును సందర్శించి అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు షాబాద్ శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి శీను, సత్యనారాయణ, దీపక్, చంటి రాజు, యాదగిరియాదవ్, నర్సింహయాదవ్, మధు, శివ, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తలసానితో వాకర్స్ అసోసియేషన్ నాయకులు

కేలండర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కేలండర్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ శుక్రవారం ఆవిష్కరించారు. గత ఎనిమిదేళ్లలో నియోజకవర్గంలో పద్మారావుగౌడ్ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన కేలండర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు గరికపోగుల చంద్రశేఖర్, తోటుల విష్ణు, మల్లూరి అనిల్ రూపొందించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల లష్కర్ ప్రజలకు బీఆర్‌ఎస్ శ్రేణులు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, బీఆర్‌ఎస్ నాయకులు తీగుళ్ల కిషోర్, కిరణ్, రామేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మారావుగౌడ్ తదితరులు

కోలుకుంటున్న ఫైర్ అధికారులు

రాంగోపాల్‌పేట్: మినిస్టర్‌రోడ్‌లోని రాధా ఆర్కేడ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన ఫైర్ అధికారులు ప్రస్తుతం కోలుకుంటున్నారు. గురువారం మంటలు ఆర్పే క్రమంలో కానిస్టేబుల్ జే.నర్సింగ్‌రావు, ఫైర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి గాయపడిన సంగతి విధితమే. వీరిని ప్యారడైజ్ ప్రాంతంలోని కిమ్స్–సన్‌షైన్ ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం కోలుకుంటున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ధనుంజయరెడ్డిని ఐసీయూ నుంచి వార్డుకు షిఫ్టు చేశామని, నర్సింగ్‌రావు ఆరోగ్యం మెరుగుపడినప్పటికీ పరిశీలన కోసం ఐసీయూలోనే ఉంచినట్లు తెలిపారు. ఇద్దరి పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించారు.

పోలీసులను దూషించిన వ్యక్తులకు జైలు శిక్ష

కంటోన్మెంట్: విధి నిర్వహణలో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన నలుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధించారు. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వెల్లడించిన వివరాల మేరకు.. గురువారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో బోయిన్‌పల్లి పీఎస్‌కు చెందిన కానిస్టేబుల్స్ కె.మహేశ్‌కుమార్, ఎండీ అబ్దుల్ పెట్రోకార్ విధులు నిర్వహిస్తూ తాడ్‌బండ్ చౌరస్తాకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ గుమిగూడి ఉన్న నలుగురు వ్యక్తులు పెట్రోకార్‌ను సమీపించారు. వీరిలో అమన్‌మిశ్రా, అర్జున్ అనే వ్యక్తులు కానిస్టేబుళ్లతో తలపడుతూ దుర్భాషలాడారు. పోలీసులను ఉద్దేశించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. కానిస్టేబుళ్లు వీరికి నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ వినిపించుకోలేదు. దీంతో నలగురు వ్యక్తులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీరికి పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్లు తేలింది. అనంతరం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చడంతో మూడు రోజుల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు.

'కంటోన్మెంట్ విలీనంతో కొత్త సమస్యలు'

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో వలీనం చేస్తే కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతాయని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం బోర్డు కార్యాలయంలో బీజేపీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. విలీనం పట్ల స్థానిక ప్రజలు విముఖంగా ఉన్నారని, 85 శాతం మంది కంటోన్మెంట్ యథావిధిగా ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే ప్రజాభిప్రాయం సేకరిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఇవ్వాల్సిన సర్వీసు చార్జీల బకాయిల్లో త్వరలోనే రూ.25 కోట్లు విడుదలవుతాయని, ఈ మేరకు డీజీడీఈ అజయ్‌కుమార్‌శర్మను కలిసి విన్నవించడంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఇంతకాలం సర్వీసు చార్జీల విషయంలో తమపై విమర్శలు చేసిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. కంటోన్మెంట్ భూములపై కన్నేసిన రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు విలీనానికి ఉత్సాహం చూపుతున్నారని ఆరోపించారు. తాను కోర్టుకు వెళ్తే గానీ టీపీటీ బకాయిలు విడుదల చేయలేదని ఆయన గుర్తుచేశారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలపై విద్యార్థుల ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాల పై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు వీసీ నిర్ణయాలపై మండిపడ్డారు. యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా దేశంలో ఎక్కడలేని విధానాలను ఓయూలో అవలంబిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎన్నడు లేని విధంగా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకుల విధానాన్ని ప్రవేశపెట్టి తనకు అనుకూలంగలేని విద్యార్థులకు యూనివర్సిటీలో ప్రవేశం లేకుండా చేశారన్నారు. ప్రవేశ పరీక్షలో 100 మార్కులకు బదులు 70 మార్కులకు ప్రశ్నలిచ్చి...అర్హత మార్కుల శాతాన్ని ఓసీలకు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40 శాతం వందలాది మంది విద్యార్థులు క్వాలీఫై కాలేకపోయరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేశ పరీక్షకు 6656 మంది అభ్యర్థులు హాజరైతే కేవలం 1508(22.66శాతం) మందిని మాత్రమే క్వాలిఫై చేయడం దారుణమన్నారు. అనంతరం ఓయూ వీసీ ఓఎస్‌డీ ప్రొ.రెడ్యానాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దశరథ్, శరత్‌నాయక్, అశోక్‌నాయక్, చందు, శివ, ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఓఎస్‌డీకి వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి నేతలు

గోవా పర్యటనలో డిప్యూటీ మేయర్


గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లైతో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు

లాలాపేట: ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి గోవా పర్యటనకు వెళ్లారు. గోవాలో మూడు రోజుల పాటు జరగనున్న కార్యక్రమంలో పబ్లిక్ సర్వీస్ సౌకర్యాలు, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, న్యాయపరమైన అంశాలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై చర్చిస్తారని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆ రాష్ట్ర గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లైని మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ మేయర్ వెంట కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి, దేవదీప్తి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. హీరో మోటో కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన ఉద్యోగులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన శంకర్‌రాజు మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాన్ని నడపాల్సిన బాధ్యత ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయడం వల్ల ఏటా ఎంతోమంది ప్రాణాలను కోల్పోయి వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనంపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించడంతో పాటు కుటుంబ సభ్యులకు, తోటివారికి సైతం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీటీఐ సీఐ నాగరాజు, హీరో కంపెనీ ప్రతినిధులు శ్రావణ్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

'గాంధీ'లో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు


సమావేశంలో పాల్గొన్న గాంధీ అధికారులు, ఇంజనీర్ల బృందం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అవయవ మార్పిడి సర్జరీలు నిర్వహించేందుకు అత్యాధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు తొమ్మిది నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆస్పత్రి పాలన యంత్రాంగం, తెలంగాణ వైద్య విద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ) ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులు పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆస్పత్రి ప్రధాన భవనం ఎనిమిదవ అంతస్తులో రూ.35 కోట్ల వ్యయంతో చేపట్టే నాలుగు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల(ఎంఓటీ) నిర్మాణ పనులు వారం రోజుల్లో ప్రారంభించి తొమ్మిది నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. సుమారు 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఎంఓటీలతో పాటు పోస్టు ఆపరేటివ్, స్టెప్‌డౌన్, ఐసీయూ, డ్రెస్సింగ్ రూమ్ తదితర విభాగాలను నిర్మించనున్నారు. భవిష్యత్‌లో మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ల సంఖ్య తొమ్మిదికి పెంచేందుకు అవసరమైన వసతులు కల్పించనున్నారు. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ రాజారావు మీడియాతో మాట్లాడుతూ.. ఎంఓటీలు అందుబాటులోకి వస్తే అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ–1 జయకృష్ణ, గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌ఓడీ శ్రవణ్‌కుమార్, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చీఫ్ ఇంజనీర్ రాజేంద్రకుమార్, ఎస్‌ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరావు, డీఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సనత్‌నగర్: సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శనివారం కన్స్యూమర్ గ్రీవెన్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సనత్‌నగర్ ఏడీఈ అమర్‌నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్‌లోని ఆల్విన్ సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగే ఈ సమావేశంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కన్స్యూమర్ ఎఫైర్స్‌లు హాజరవుతారన్నారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలతో పాటు బిల్లుల్లో హెచ్చుతగ్గులు విషయమై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

అద్దె ఇంట్లో ఉన్న వ్యక్తుల దాడిలో యజమాని మృతి

అమీర్‌పేట: తన ఇంట్లో అద్దెకు ఉంటున్న యువకులు కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన యజమాని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల మేరకు.. తాటిపత్రి ప్రవీణ్‌కు సనత్‌నగర్ సౌభ్యానగర్‌లో తన ఇంటిని శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చారు. 2022 జూన్ 23న ప్రవీణ్ తండ్రి గోపీనాథ్(78) అద్దె కోసం రూంకి వెళ్లగా శ్రీనివాస్‌రెడ్డి కనిపించలేదు. హర్షద్, వినయ్ అనే ఇద్దరు యువకులు డోర్ తీసి అతడితో గొడవకు దిగారు. గోపీనాథ్‌పై దాడి చేయగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆయనను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఇల్లు అద్దెకు తీసుకున్న శ్రీనివాస్‌రెడ్డి భార్య ప్రసవం కోసం వెళ్లడంతో గుంటూరుకు చెందిన యువకులను ఆ ఇంట్లో ఉంచి అతడు వెళ్లాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు గొడవ జరిగిన రోజే కేసు నమోదు చేసి ఇద్దరు యువకులను రిమాండ్ చేశామన్నారు.

'కంటి వెలుగు' పేదలకు వరం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రసూల్‌పురా: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరం అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.500 తీసుకుని చేసే కంటి పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు రసూల్‌పురా గన్‌బజార్ కమ్యూనిటీహాల్‌లో ఎమ్మెల్యే జి.సాయన్న, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి వెంకటితో కలిసి మంత్రి తలసాని శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వం లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.250 కోట్ల వ్యయంతో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం చేపడుతున్నారన్నారు. 50 ఏళ్లు పైబడిన వారికే కంటి చూపు సమస్యలు వస్తాయనే అపోహ సరికాదని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే సాయన్న, గజ్జెల నాగేష్ మాట్లాడుతూ.. రెండో విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కంటి వెలుగు శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్ల జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్‌పీహెచ్‌వో రాజకుమారి, మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్, డాక్టర్ సుష్మ, కంటి వెలుగు మెడికల్ ఆఫీసర్ డా.ఇందిర పాల్గొన్నారు.


యువకుడికి కళ్ల జోడు అందిస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే సాయన్న తదితరులు

ప్రజల నుంచి మంచి స్పందన

అడ్డగుట్ట: కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఎస్‌పీహెచ్‌ఓ రాజశ్రీ తెలిపారు. అడ్డగుట్ట డివిజన్లోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాలు, బోయబస్తీ కమ్యూనిటీహాలులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. కంటి వెలుగు ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న పేదల జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. బీజేఆర్ కమ్యూనిటీహాలులో 129 మందికి పరీక్షలు నిర్వహించి 96 మందికి కళ్లజోళ్లు ఇచ్చామని, బోయబస్తీ కమ్యూనిటీహాలులో 144 మందికి పరీక్షలు నిర్వహించి 104 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిశంకర్‌తో పాటు ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వసతులు కల్పించాం

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్ పరిధిలోని అన్ని కంటి వెలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అన్ని కేంద్రాల్లో 4,984 మందికి కంటి పరీక్షలు నిర్వహించారని చెప్పారు. 2,454 మందికి కంటి అద్దాలు అందించి, 751 మందిని ఆపరేషన్ల నిమిత్తం సిఫారసు చేసినట్లు ఆయన వెల్లడించారు. జోన్ పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి సర్కిళ్ల పరిధిలో 38 కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ బృందాలకు, పరీక్షల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని ఆయన అన్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో సెలవుల కారణంగా కంటి వెలుగు కేంద్రాలు మూసి ఉంటాయని, తిరిగి 23న నుంచి పరీక్షలు ప్రారంభవుతాయని తెలిపారు.


కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించిన ఎస్‌పీహెచ్‌ఓ రాజశ్రీ